క్లుప్తంగా

నేడు ఇళ్లపట్టాల పంపిణీ

మద్దికెర: స్థానిక కొండమ్మబావి వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో శనివారం 332 మందికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నాగరాజు శుక్రవారం తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చేందుకు 2009లో 8.63 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. అయితే పది మంది లబ్ధిదారులు సదరు స్థలంలో తమకు రెవెన్యూ అధికారులు ఇంటిపట్టాలు మంజూరు చేశారని పేర్కొంటూ 2005లో నకిలీ పట్టాలతో కోర్టుకు వెళ్లడంతో పంపిణీ నిలిచిపోయిందన్నారు. అయితే 2009లో కొన్న స్థలానికి 2005లో ఇంటిపట్టాలు ఎలా ఇస్తారని అధికారుల విచారణలో బయటపడిందన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు, కోర్టు నిబంధనలను అనుసరించి ఇంటిపట్టాలు పంపిణీ చేస్తామన్నారు.

చలివేంద్రం ప్రారంభం



పెన్షనర్లు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పెన్షనర్లు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన కూడలిలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు మినరల్ వాటర్‌తో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పెన్షనర్ల సంఘ అధ్యక్షులు ఏపీ వీరన్న, కోశాధికారి శ్రీనివాసులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభోత్సవం



తొగర్చేడులో లక్ష్మీ చెన్నకేశవ స్వామి ప్రభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో శుక్రవారం లక్ష్మీచెన్నకేశవ స్వామి ప్రభోత్సవం భక్త జనుల మధ్య వైభవంగా సాగింది. ఉదయం ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రభపై ఉంచి గ్రామ వీధుల గుండా ప్రభోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ప్రభ ముందు నందికోల సేవ ఆకట్టుకుంది. అలాగే టి.గోకులపాడులో సీతారాముల ప్రభోత్సవం, కంబాలపాడు, పెనుమాడ, సంగాల తదితర గ్రామాల్లో సీతారామ పట్టాభిషేకం నిర్వహించారు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు చేపట్టారు.

జయప్రదం చేయండి

ఆలూరు: వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించే అంశంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత నెల శాసన సభలో తీర్మానం ప్రవేశపెట్టినందుకు కృతజ్ఞతగా కర్నూలులో ఏప్రిల్ 2న నిర్వహించ తలపెట్టిన మహా సమ్మేళనంను జయప్రదం చేయాలని రాష్ట్ర వీఆర్‌పీఎస్ అధికార ప్రతినిధి రాంభీమ్‌నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన వాల్మీకి నాయకులతో సమావేశమై సమ్మేళనం నిర్వహణపై పలు సూచనలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, వైస్ ఎంపీపీ నాగవేణి, నాయకులు బీసీ మాదన్న, ఈరన్న, వెంకటేశ్వర్లు, వరుణ్, శ్రీధర్ ఎంపీటీసీ సభ్యుడు దేవరాజ్, శివయ్య, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అష్టమాంకములు నాటకం

తుగ్గలి: శ్రీరామనవమి సందర్భంగా రాంపల్లిలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ప్రదర్శించిన అష్టమాంకములు ఉచిత నాటకం అందరినీ అలరించింది. మయసభ, పడక సీను, భవాని చింతామణి సీను, రామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణ తులాభారం, గయోపాఖ్యానం, సత్య హరిశ్చంద్ర వారణాసి, కాటిసీను నాటకాల్లో కళాకారులు చక్కటి అభినయంతో నాటకాన్ని రక్తి కట్టించారు. కళాకారులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



పి.సుమలత

గోనెగండ్ల: చత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయిలో జరిగిన 30వ సబ్ జూనియర్ జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో గోనెగండ్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని పి.సుమలత సత్తా చాటిందని పాఠశాల ఎస్‌ఓ విద్యావతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మార్చి 28 నుంచి 30 తేదీ వరకు జరిగిన పోటీల్లో పి.సుమలత రాష్ట్రం తరఫున పాల్గొని రాణించడంతో జట్టు మూడవ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. విద్యార్థినికి తర్ఫీదు ఇచ్చిన పీఈటీ, ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయం పదిలం

- ఏప్రిల్ 3 నుంచి పదవ తరగతి పరీక్షలు
- ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండలో 11,200 మంది విద్యార్థులు
- ప్రణాళికాబద్ధంగా ప్రిపరేషన్లు



స్టడీ అవర్‌లో చదువుకుంటున్న నందవరం కస్తూర్బా విద్యార్థినులు

ఎమ్మిగనూరు: ఏడాదంతా ఎంతో ప్రణాళికబద్ధంగా చదివిన పదో తరగతి విద్యార్థులకు ప్రతిభను చూపే పరీక్షా కాలం మొదలవుతోంది. కష్టపడి చదివిన చదువులను పరీక్షల్లో రాయాలంటే ముందుగా విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనలను అధిగమించాలి. మానసికంగా, శారీరకంగా ఆరోగ్యం దృఢమవ్వాలి. విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేస్తోంది. అందుకు అనుగుణంగా విద్యాశాఖకు దిశా నిర్దేశాలను సూచించింది. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలను పేద విద్యార్థులకు అందిస్తున్నప్పుడు అందుకు ధీటుగానే పదవ తరగతి ఫలితాలు ఉండాలని తేల్చిచెప్పింది. ఏప్రిల్ 3 నుంచి పదవ తరగతి పరీక్షలు మొదలవుతున్నాయి.

ఒత్తిడే సవాల్ ..

పది పరీక్షలు అనగానే విద్యార్థుల్లో తెలియని ఆందోళన, మానసిక ఒత్తిళ్లు యాదృచ్ఛికంగా మొదలవుతాయి. విద్యార్థులు ఇప్పటికే తెల్లవారుజామున 4గంటల నుంచి 6 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటలవరకు అదనంగా చదువుకుంటున్నారు. పాఠశాలల్లో ప్రవేటు క్లాసుల పేరుతో అదనపు శిక్షణ ఇచ్చారు. ట్యూషన్ల పేరుతో మరింత తర్ఫీదులు ఉండనే ఉన్నాయి. గతంలో హిందీ తప్పా అన్ని సబ్జెక్టులకు రెండు పేపర్లు ఉండేవి. ఒక పేపరు సరిగా రాయకపోయినా రెండో పేపరులో మార్కులు స్కోరు చేసేలా ప్రయత్నాలు జరిగేవి. ప్రస్తుతం ఒక పేపర్ మాత్రమే ఉండటంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. విద్యార్థుల్లో ఉన్న ఆందోళనలు, చదువు ఒత్తిడిని తగ్గించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ చూపాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

ఎస్ఎస్‌సీ పరీక్షలకు 11,200 మంది విద్యార్థులు

ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో మొత్తం 11,200 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 10,043 మంది విద్యార్థులు, ప్రవేట్ పాఠశాలల నుంచి 1,157 మంది విద్యార్థులు ఉన్నారు. డీఈఓ రంగారెడ్డి ప్రత్యేక పర్యవేక్షణతో అధికారుల్లో, ఉపాధ్యాయుల్లో పదవ తరగతి విద్యార్థులపై ఫోకస్ పెరిగింది. గతేడాది ఫలితాల్లో వెనుకబడిన మండలాలపై ఎస్ఎస్ఏ కూడా ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. గతేడాది పది ఫలితాల్లో జిల్లాలో అత్యధికంగా మద్దికెర మండలంలో 76.41 శాతం, కృష్ణగిరి మండలంలో 74.96 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా గోనెగండ్ల మండలంలో 30.33 శాతం, నందవరం మండలం 31.82 శాతం ఉత్తీర్ణతను సాధించాయి. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు జరగనుండగా ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షా సమయం ఉంటుంది.

2023 ఎస్ఎస్‌సీ పరీక్షలు రాసే విద్యార్థులు

నియోజకవర్గం	బాలురు	బాలికలు	మొత్తం
ఎమ్మిగనూరు	2,021	1,682	3,703
ఆలూరు	2,072	1,717	3,789
పత్తికొండ	1,886	1,822	3,708
మొత్తం	5,979	5,221	11,200

నిద్ర, సాత్వికమైన ఆహారం అవసరం



పరీక్షల సమయంలో విద్యార్థులకు సహజంగానే ఒత్తిళ్లు ఏర్పడుతాయి. రోజుకు ఆరు గంటలపాటు నిద్ర పోవాలి. నిద్రలో ప్రధానమైనది గాఢ నిద్ర. ఇది 25 శాతం ఉండాలి. దీనివల్ల చదివిన అంశాలు మెదడులో నిక్షిప్తమవుతాయి. సాత్వికమైన ఆహారం తీసుకోవడం మంచిది.

– డాక్టర్ మైత్రేయి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్

టైమ్ మేనేజ్‌మెంట్ ఉండాలి



విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో ఆ సబ్జెక్టును ఎక్కువగా రివిజన్ చేస్తూ ఉండాలి. పరీక్షల్లోగానీ, రివిజన్‌లోగానీ ఏ టైంలో ఏ ప్రశ్నలు రాయాలి, ఎంతసేపటిలో పూర్తి చేయాలనే టైం మేనేజ్‌మెంట్ విద్యార్థులకు చాలా అవసరం. దీనివల్ల అన్ని విభాగాల్లో మార్కులను స్కోర్ చేయవచ్చు

– యాజీ సుకుమార్, డిప్యూటీ ఈఓ, ఆదోని

వాహనాలు ఇవ్వొద్దు



పరీక్షల సమయంలో విద్యార్థుల ఆలోచనలు, ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు, బంధువులే పరీక్షా కేంద్రాల వద్ద వారిని వదిలిపెట్టడం మంచిది. విద్యార్థులకు వాహనాలు ఇవ్వొద్దు. పరీక్షా సమయానికి అరగంట ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి.

– మధుసూదన్‌రావు, పట్టణ సీఐ

3న మార్కెట్ వేలం

మద్దికెర: పెరవలి గ్రామ పంచాయతీ పరిధిలోని దినసరి మార్కెట్లలో ఏడాది పాటు సుంకం వసూలు చేసుకోడానికి ఏప్రిల్ 3న పంచాయతీ కార్యాలయంలో సాయంత్రం 3 గంటలకు సర్పంచ్ మల్లికార్జున, ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి సుధాకర్ శుక్రవారం తెలిపారు. పాటదారులు రూ.30 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని సూచించారు.

వ్యాపారుల మోసాలను అరికట్టండి

ఎమ్మిగనూరుటౌన్: లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తూ పత్తి రైతులను మోసం చేసే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్‌యాదవ్, ఏపీ రైతు సంఘ నాయకులు సత్యన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఉమాపతి రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. యార్డులో 9 దుకాణాలకు లైసెన్స్ ఉండగా 11 దుకాణాలకు లేదన్నారు. ప్రభుత్వమే సీసీఐ ద్వారా గిట్టుబాటు ధరకు పత్తి కొనుగోలు చేయాలన్నారు. పట్టణంలో ప్రైవేటు వ్యాపారుల మోసాలను అరికట్టాలని కోరారు. ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి బాలరాజు, నాయకులు మాలిక్, వుసేని, శివరాముడు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఆలూరు: పేద, బడుగు, బలహీనవర్గాల వారు ఉన్నతంగా ఎదగాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని కమ్మరచేడు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జునరెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం హెచ్‌ఎం కరిబసప్ప ఆధ్వర్యంలో హైస్కూల్ ఆవరణలో సరస్వతి పూజ నిర్వహించారు. ఆలూరు ఎంపీపీ రంగమ్మ, మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరీక్షలకు సన్నద్ధం కావడంపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అదేవిధంగా హొళగుంద మండలం చింతకుంట గ్రామంలో పది పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎంఈఓ ఈరన్న అవగాహన కల్పించారు. ఎంఆర్పీలు రమణారెడ్డి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో అభివృద్ధి



మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరుగుతున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని విపక్ష సభ్యులు వాటిని పరిశీలించి మాట్లాడాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో విపక్ష కౌన్సిలర్ దయాసాగర్ తమ వార్డులో 14వ ఆర్థిక సంఘం నిధుల కింద రోడ్లు మంజూరైన నిర్మించలేదని ఆరోపించారు. దీనికి వైస్ చైర్మన్ స్పందిస్తూ 14 ఆర్థిక సంఘ నిధులు రూ.11 కోట్లలో దాదాపు రూ.6.10 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించామన్నారు. రూ.4.40 కోట్లతో విద్యుత్ బకాయిలు తదితర వాటికి చెల్లించినట్లు వివరించారు. అలాగే 15వ ఆర్థిక సంఘ నిధులతో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అంతకుముందు పట్టణంలో పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అన్న క్యాంటిన్ సచివాలయం వద్ద ఉన్న 49 సెంట్ల స్థలంలో ఆక్రమణలు తొలగించి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి, అయ్యప్ప స్వామి గుడి పక్కన ఉన్న చిల్డ్రన్స్ పార్కుకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేరు పెట్టేందుకు తీర్మానం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 111 షాపులకు అద్దె పెంచి మరో మూడేళ్లు లీజు రెన్యూవల్ చేసేందుకు ఆమోదించారు. శ్రీనివాస థియేటర్ నుంచి మార్కెట్ యార్డ్ వరకు రోడ్డు మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్‌కు అంబేద్కర్ సర్కిల్ నుంచి ఎద్దుల మార్కెట్ వరకు గంజిళ్ల రోడ్డుకు బీటీ రోడ్డు నిర్మాణానికి, పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైస్ చైర్మన్లు నజీర్‌అహమ్మద్, దివ్యకళ, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ, మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్‌మెంబర్లు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. వనం వేంకటేశుని కల్యాణం



రామళ్లకోటలో వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణ ఘట్టం

వెల్దుర్తి: రామళ్లకోటలో శ్రీదేవి, భూదేవిలతో వనం వేంకటేశ్వర స్వామి వారి పరిణయోత్సవం శుక్రవారం కనులపండుగగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సుందరంగా అలంకరించిన ఆలయాన సత్యపీఠంగా భావించే పచ్చలబండపై కల్యాణ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు దేవలం సురేశ్, ఆస్థాన పండితులు ములుకుట్ల ఆంజనేయశర్మ సోదరుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, కర్పూర కాంతుల నడుమ వేడుక అంబరాన్ని తాకింది. సర్వజగత్తుల కల్పవల్లులు, పుణ్యాలరాశులైన భూదేవి, శ్రీదేవి అమ్మవార్ల మాంగళ్యధారణ మహోన్నతంగా సాగింది. స్వామి అమ్మవార్లకు డీలర్ శేషాలు సోదరులు పట్టువస్త్రాలు, కల్యాణ ఖర్చులు సమర్పించారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు, అన్నదానం బేతం వంశీయులు సమకూర్చారు. కార్యనిర్వాహకులుగా ధర్మకర్తల మండలి చైర్మన్ చింతకాయల వెంకటేశ్వర్లు, సర్పంచ్ నిర్మల, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మాధవస్వామి, ఆలయ సిబ్బంది మద్దిలేటి వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామి వార్ల హనుమద్ వాహన సేవ దాదిరెడ్డి వంశీయులచే నిర్వహించారు. శనివారం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు సింహవాహన సేవ నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

పవనపుత్రా.. పాహిమాం



అశేష భక్తజనం మధ్య ఆంజనేయస్వామి రథోత్సవం

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో శుక్రవారం ఆంజనేయస్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభంగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆలయంలో వెలసిన సీతారాముల విగ్రహాలకు అర్చకులు రూపామోహన్‌శర్మ ఆధ్వర్యంలో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, నందికోలు సేవ, కుంభోత్సవం, రథాంగబలి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్ద శివారెడ్డి ఇంటి నుంచి కుంభాన్ని మేళతాళాలతో రథం దగ్గరకు తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి భక్తుల జయజయ ధ్వనుల మధ్య రథాన్ని లాగారు. రథాన్ని గ్రామ చివరి వరకు లాగి తిరిగి ఆలయం వద్దకు చేర్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం

చిప్పగిరి: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని నేమకల్లు గ్రామంలో శ్రీరాముడి రథోత్సవం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా రథాన్ని గ్రామ పుర వీధుల గుండా ఊరేగించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి, ఎంపీపీ జూటూరు హేమలత, మారయ్య రథోత్సవంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అరటిపండ్ల అలంకరణలో ఆంజనేయ స్వామి

హోరాహోరీగా గ్రామీణ క్రీడాపోటీలు



బోయనపల్లెలో బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న అశోక్ రెడ్డి

వెల్దుర్తి: శ్రీరావనవమి వేడుకలు పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాలలో క్రీడాపోటీలు హోరాహోరీగా సాగాయి. బోయనపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో గుండు ఎత్తు పందెంలో మాధవరం ఈశ్వరరెడ్డి విన్నర్‌గా, మాధవరం రంగస్వామి రెండో స్థానంలో నిలిచారు. చందా ఎత్తు పందెంలో పుల్లగుమ్మి సుధాకర్ విన్నర్‌గా, మాధవరం సోమశేఖర్ రెండో స్థానంలో నిలిచారు. పరుగు పందెంలో నంద్యాల కిషోర్, లక్ష్మీపురం దివాకర్, గిరక పందెంలో మాధవరం రంగస్వామి, మల్యాల శ్రీను, బైక్ స్లో పందెంలో శ్రీను, ఎల్లకృష్ణ విజేతలుగా నిలిచి నగదు బహుమతులు, వెండిని గెలుపొందారు. బండలాగుడు పోటీలలో విజేతలుగా బోయ రవి వృషభాలు నిలువగా, తర్వాతి రెండు స్థానాలలో సురేశ్, రత్నపల్లె ఈశ్వరయ్య వృషభాలు నిలిచాయి. మహిళలకు నిర్వహించిన తాడు లాగే పందెం ఆకర్షణగా నిలిచింది. అలాగే నర్సాపురంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన చందా ఎత్తే పందెంలో హరికృష్ణ విజేతగా నిలిచాడు. ట్రాక్టర్ రివర్స్‌లో సుధాకర్, వెంకటేశ్వర్లు, గిరక పందెంలో కాటమరాజు, గజ్జలయ్య విజేతలుగా నిలిచారు. బండలాగుడు పందెంలో నర్సాపురం కురువ మాదన్న వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచి రూ.10,016, ద్వితీయ స్థానంలో నిలిచిన కొత్తకోట మహేశ్వరరెడ్డి వృషభాలు రూ.5,016 గెలుచుకున్నాయి.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం





ఆసరా పథకం మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, పీడీ వెంకట సుబ్బయ్య తదితరులు, హాజరైన మహిళలు

గోనెగండ్ల: మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. శుక్రవారం గోనెగండ్లలోని భాషా ఫంక్షన్ హాలులో పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య తదితరులు మండలంలోని 565 పొదుపు గ్రూపులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3.48 కోట్ల మెగా చెక్కును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసంకల్ప యాత్రలో పొదుపు మహిళల కష్టాలు నేరుగా తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా రుణమాఫీ చేస్తున్నారన్నారు. ఆసరా సొమ్ముతో వివిధ వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని, వచ్చే ఆదాయంతో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చి మహిళలను దారుణంగా మోసగించిందని మండిపడ్డారు. ప్రజలు గత టీడీపీ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో తేడాను గమనించాలని కోరారు.

మహిళా పక్షపాతి జగనన్న

రాష్ట్రప్రభుత్వం సంక్షేమ పథకాలలో మహిళలకు అగ్రతాంబులం ఇస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో పథకాలు అమలు చేయకుండా జన్మభూమి కమిటీలు దోచుకున్నాయని మండిపడ్డారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత ఉంటే చాలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని వివరించారు.

సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. అనంతరం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏపీ శ్రీనివాసులు, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ నాగేష్, ఏపీఎం హేమలత, ఎంపీపీ టీ.నసురుద్దీన్, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి ఓపెన్ వర్సిటీ తరగతులు

ఎమ్మిగనూరుటౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో యూజీ బీఏ డిగ్రీ మొదటి, 4వ, 6వ సెమిస్టర్ విద్యార్థులకు ఏప్రిల్ 2వ తేదీన, 8, 9, 16, 23 తేదీల్లో స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దూర విద్య తరగతులు నిర్వహించనున్నట్లు స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ బలరాముడు శుక్రవారం తెలిపారు. బీఎస్సీ, బీకాం విద్యార్థులకు కర్నూలు సిల్వర్‌జూబ్లీ కళాశాలలో తరగతులు ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

పత్తికొండటౌన్: పత్తికొండలో శుక్రవారం రాత్రి పోచిమిరెడ్డి సేవాదళ్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. స్థానిక బ్రాహ్మణ వీధిలోని సేవాదళ్ వాటర్ ప్లాంటు వద్ద అధ్యక్షుడు పి.మురళీధర్ రెడ్డి ముస్లింలకు భోజనం వడ్డించారు. రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేయడం ఆనందంగా ఉందన్నారు. నాయకులు గోవిందరాజు, కోటేశ్వరరావు, బారిక బసన్న తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఆదాయం

ఆలూరు రూరల్: మొలగవల్లి గ్రామ పంచాయతీకి సంబంధించి శుక్రవారం షాపింగ్ కాంప్లెక్స్ వేలాలు సర్పంచ్ మోహన్ రాజు సమక్షంలో ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు నిర్వహించారు. గ్రామంలో ఉన్న నాలుగు షాపింగ్ కాంప్లెక్స్‌లకు వేలంలో రూ.1,41,600 పలికినట్లు ఈఓపీఆర్డీ తెలిపారు. గతేడాది కంటే రూ.32,400 ఆదాయం పెరిగినట్లు వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శి నాయుడు, సిబ్బంది ఉన్నారు.

ఇద్దరు వీఆర్వోలు నియామకం

కృష్ణగిరి: కృష్ణగిరి మండలానికి ఇద్దరు వీఆర్వోలను నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తహసీల్దార్ పురుషోత్తం శుక్రవారం తెలిపారు. కృష్ణగిరికి రామ్మోహన్‌రెడ్డి, పోతుగల్లుకు వెంకటేశ్వర్లు విధుల్లో చేరినట్లు తెలియజేశారు. అంకితభావంతో పని చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా వీఆర్వోలకు సూచించారు.

డ్వాక్రా సంఘాలకు కొండంత ‘ఆసరా’



మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న అధికారులు, నారాయణస్వామి

ఆలూరు: మహిళా సాధికారతే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. హాలహర్విలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో శుక్రవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద 419 పొదుపు గ్రూపులలోని 3,973 మంది సభ్యులకు రూ.2,70,94,000 చెక్కును ఎంపీపీ బోయ నెట్టికంఠమ్మ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అంతకముందు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు సైతం ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు మంజూరు చేస్తోందని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, నాయకులు శ్రీనివాసులు, భీమప్ప, వెంకటేశ్వర్లు, బజారమ్మ, వీరేష్, బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుడిపాడు వృషభాల రాజసం

కృష్ణగిరి: పెనుమాడ గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను శుక్రవారం మాజీ ఎంపీపీ కేఈ జయన్న ప్రారంభించారు. పోటీల్లో నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం గుడిపాడు రావుల వెంకటరామిరెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి.తరువాతి స్థానాల్లో మారెళ్ల, ఉంగరానిగుండ్లకు చెందిన పరేమేష్, విజయ్‌ల ఉమ్మడి వృషభాలు, ప్యాపిలి మండలం డి.రంగాపురం జూటూరు రామచంద్రారెడ్డి వృషభాలు, ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల సర్పంచ్ రంగస్వామి నాగన్న వృషభాలు, పెద్దకడబూరు రాముడు వృషభాలు నిలిచాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు నిర్వాహకులు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలను అందజేశారు.

భజన పోటీల విజేత శంకరాపురం

అలాగే గురువారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి భజన పోటీల్లో బేతంచర్ల మండలం శంకరాపురం బృందం విజేతగా నిలిచింది. పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 12 బృందాలు పాల్గొనగా రెండో స్థానంలో అలంకొండ, తరువాతి స్థానాల్లో ఉయ్యాలవాడ, హరిగేరి, అనంతపురం జిల్లా కూచివారిపల్లె బృందాలు నిలిచాయి. విజేతలకు రూ.20 వేలు, తరువాతి 11 స్థానాల్లో నిలిచిన బృందాలకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. న్యాయ నిర్ణేతలను గ్రామ అభయహస్త ఆంజేయస్వామి భజన బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

తుగ్గలి: శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం తుగ్గలిలో నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను ఎస్‌ఐ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి ప్రారంభించారు. పోటీలలో వరుసగా బాలతిమ్మయ్య, మద్దిలేటి, పీరా, సంజీవరాయుడు వృషభాలు గెలుపొందాయి. ఆయా వృషభాల యజమానులకు వరుసగా మోహన్‌రెడ్డి రూ.10 వేలు, వడ్ల నాగార్జున రూ.6 వేలు, మానుకింద రంగస్వామి రూ.4 వేలు, చిన్నారెడ్డి రూ.2 వేలు నగదు బహుమతులు అందజేశారు.

నేడు బండలాగుడు పోటీలు

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం రాష్ట్రస్థాయి వృషభాల రాతి దూళం లాగే పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ ప్రేమ్‌కుమార్, గ్రామ పెద్దలు తెలిపారు. వారు మాట్లాడుతూ పోటీలలో విజేతలుగా నిలిచిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు నగదు బహుమతులను దాతల సహకారంతో అందించనున్నట్లు వెల్లడించారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

వెల్దుర్తి: రానున్న ఖరీఫ్ సీజన్‌లో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఏఓ అక్బర్‌బాషాతో కలిసి మల్లెపల్లె గ్రామంలో రైతు నాగరాజు ప్రస్తుత రబీలో సాగు చేసిన కొర్రపంటను పరిశీలించారు. పంట బాగా పండడంతో దిగుబడి ఆశాజనకంగా వస్తుందని రైతు తెలపడంతో ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చిరుధాన్యాలకు మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఆర్బీకే సిబ్బంది, రైతులు ఉన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

తుగ్గలి: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రి అన్నారు. శుక్రవారం జొన్నగిరి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. చిరుధాన్యాలలో పిండి పదార్థాలతో పాటు ప్రొటీన్లు, సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయని ఆమె తెలిపారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలను రోజువారీ తీసుకునే ఆహారంలో భాగంగా చేర్చుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.